క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల నిరసన



ఇబ్రహీంపట్నం: విజయవాడ గవర్నర్ పేట -1, 2 డిపోల ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలులాకు ఇవ్వాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మొదటి రోజు రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బీఎస్‌రావు, మోహన్, గ్యారేజ్ కార్యదర్శి వి. కోటేశ్వరరావు, అధ్యక్షుడు శంకర్ వధూద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



ఇబ్రహీంపట్నం: గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గత ఐదు నెలలుగా ఉచిత కుట్టు శిక్షణ పొందిన 30 మంది మహిళలకు కుట్టు మిషన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ టైలరింగ్‌లో నైపుణ్యత పెంచుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. సంస్థ కార్యదర్శి సుమలత, బెరాకా మినిస్ట్రీస్ పాస్టర్ పాల్, బిషప్ మోజెస్, మహిళలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నూజివీడు: లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్, మానవత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కోనేరుపేటలోని త్రివిధ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలతో పాటు కిడ్నీ సమస్యలు, ఊపిరితిత్తులు, ఈఎన్‌టీ, దంత, ఎముకలు, నరాలు, లివర్ తదితర సంబంధిత వాటికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తామన్నారు.

వరాహాల పట్టివేత



సాక్షి ఎఫెక్ట్..


ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో ఎక్కడైనా పందులు సంచరిస్తే పందుల పెంపకందారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ ఆనంద్‌బాబు హెచ్చరించారు. పందుల సంచారంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈఓపీఆర్డీ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో గ్రామంలో సంచరిస్తున్న పందులను పంచాయతీ సిబ్బంది పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించారు.

బురదమయంగా జగనన్న కాలనీ రోడ్డు



చాట్రాయి: చనుబండ జగనన్న కాలనీ బురదమయంగా మారడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ కాలనీలో 35 మందికి నివేశన స్థలాలు మంజూరు కావడంతో సుమారు 20 కుటుంబాల వారు గృహాలు నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు. చిన్నపాటి వర్షానికి ఇక్కడ రోడ్డు బురదమయంగా మారడంతో నడిచేందుకు కూడా వీలులేకుండా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటిలో నివసిస్తున్నామని, పాములు తిరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

100 మందికి నేత్ర వైద్య పరీక్షలు



మైలవరం: సేవా కార్యక్రమాలు చేయడమే లయన్స్ క్లబ్ ధ్యేయమని లయన్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మైలవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. 100 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి త్వరలో విజయవాడ వాసన్ ఐ కేర్ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కమిటీ సభ్యులు చనమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలవాది హరీష్ కుమార్ గుప్తా, జోన్ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

సమస్యల లోగిళ్లు..

- ఇరుకు గదుల్లో విద్యార్థుల ఇబ్బందులు
- శిథిలావస్థకు చేరిన వసతిగృహ భవనాలు
- ఎస్సీ వసతిగృహాల్లో బెడ్లు లేక నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు
- బాలికల వసతి గృహాలకు భద్రత కరువు



కొండపల్లి మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలో నేలపై కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు

జి.కొండూరు/తిరువూరు/నూజివీడు: పేద విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన ప్రభుత్వం వివక్ష చూపడంతో వసతి గృహాల్లో విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివే స్థోమత లేక, ప్రభుత్వాన్ని నమ్ముకొని భవిష్యత్తు కలలు కంటూ వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకు అవి నరక కూపంలా మారాయి. మౌలిక వసతులు లేక, ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థులు పడుతున్న మనోవేదన అంతా ఇంతా కాదు. పడుకునేందుకు బెడ్లు లేక నేలపైనే పడుకుంటూ సగం నిద్రతోనే గడుపుతున్నారు. బాలికల వసతి గృహాలకైతే రక్షణ గోడలు లేక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం వీడి వసతి గృహాలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

414 మంది విద్యార్థులకు 15 గదులు..

జి. కొండూరు: ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 414 మంది విద్యార్థులకు గాను 15 గదులు మాత్రమే ఉన్నాయి. ఇరుకు గదుల్లోనే తరగతి, రెసిడెన్షియల్‌గా ఉపయోగిస్తున్నారు. 32 టాయిలెట్లు విద్యార్థులకు నిర్మించారు. విద్యార్థులు నిద్రించేందుకు సరైన సదుపాయాలు లేవు. ఒక్కొక్కరికి రెండు బెడ్ షీట్లు కేటాయించగా ఒకటి కింద వేసుకొని మరొకటి కప్పుకొని అసౌకర్యం మధ్య నిద్రిస్తున్నారు. ఐదు నుంచి పదో తరగతి వరకు గల హాస్టల్‌లో మొత్తం 17 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ పట్టి సన్న బియ్యంగా సరఫరా చేస్తున్నట్లు కనిపించింది. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 260 మంది బాలికలు మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. పది మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా ఏడుగురితో సరిపెట్టారు. మధ్యాహ్న భోజనం ఓ మోస్తరుగా ఉంది.

SAKSHI సాక్షి గ్రౌండ్ రిపోర్టు GROUND REPORT



జి.కొండూరు ఎస్సీ వసతిగృహంలో బెడ్లు లేకపోవడంతో నేలపై పడుకున్న విద్యార్థులు

మైలవరంలో మూడు హాస్టల్స్ ఉన్నాయి. విద్యార్థులకు పడుకునేందుకు ఒక కార్పెట్, బెడ్ షీట్, టవల్ ఇచ్చారు. ఈ మూడు వసతిగృహాల్లో పిల్లలకు బెడ్డులు లేక కిందనే పడుకోవాల్సి వస్తోంది.

డైనింగ్ హాల్ సరిపోక మూడు బ్యాచ్‌లుగా వడ్డన..

జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మొత్తం 776 మంది విద్యార్థినులు ఉన్నారు. డైనింగ్ హాల్ సరిపోకపోవడంతో మూడు బ్యాచ్‌లుగా వడ్డిస్తున్నారు. వీరికి 64 బాత్రూమ్‌లు ఉండగా 38 మాత్రమే పని చేస్తున్నాయి. డార్మిటరీ బిల్డింగ్ 40 ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండడంతో పాఠశాల భవనంలోనే వీరికి వసతి కల్పిస్తున్నారు. సిబ్బందికి కూడా వసతి సౌకర్యం లేకపోవడంతో ప్రిన్సిపాల్ మినహా అందరూ సుదూర ప్రాంతాల నుంచే వస్తున్నారు. ఇంటర్నల్ రోడ్స్ లేవు. పాఠశాల ముందు భాగంలో ఉన్న ప్రహరీ రెండు నెలల కిందట వచ్చిన వరద ప్రవాహానికి ధ్వంసమైంది. తాత్కాలికంగా ఐరన్ మెస్ ఏర్పాటు చేసి గ్రీన్ మ్యాట్‌ను కట్టి వదిలేశారు. విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐరన్ విద్యుత్ స్తంభాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి.

బెడ్డులు లేక నేలపైనే నిద్ర

ఇక్కడ చదువుతున్న విద్యార్థినులలో 235 మంది ఐఐటీ బాలికలకు తప్ప మిగిలిన బాలికలు బెడ్డులు లేకపోవడంతో నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. జి.కొండూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో 44 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి పడుకునేందుకు బెడ్‌లు లేకపోవడంతో కిందనే పడుకుంటున్నారు. ఈ వసతిగృహం భవనానికి ఇటీవలనే మరమ్మతులు చేయడంతో ఇక్కడ సమస్యలు అంతగా లేవు. జి.కొండూరులోని బీసీ బాలికల వసతి గృహంలో 24 మంది ఉన్నారు. ఇక్కడ బెడ్ల సౌకర్యం ఉండడంతో పాటు అన్ని వసతులు బాగానే ఉన్నాయి.

ఇన్‌చార్జి వార్డెన్లే దిక్కు..

తిరువూరు/విస్సన్నపేట: తిరువూరు నియోజకవర్గంలో మొత్తం 14 వసతి గృహాలున్నాయి. తిరువూరులోని సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల కళాశాల వసతిగృహాలన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లు లేరు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల వసతిగృహాల వార్డెన్లే ఈ కళాశాల హాస్టళ్లకు కూడా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో వార్డెన్ల పర్యవేక్షణ కరువైంది.

వసతులు లేక.. గదులు చాలక

తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 169 మంది విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బంది పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరింది. మరుగుదొడ్లు చాలడం లేదు. బీసీ బాలుర సంక్షేమ వసతిగృహం భవనం శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. కళాశాల విభాగ విద్యార్థులకు ప్రైవేటు భవనంలో వసతి కల్పించారు. తిరువూరు రాజుపేటలోని ప్రైవేటు భవనంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహంలో ఒకే గదిలో 70 మంది విద్యార్థినులు సర్దుకోవలసి వస్తోంది. విస్సన్నపేటలో ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో అధికారుల పర్యవేక్షణలేక విద్యార్థులు చేరడం లేదు. అన్ని సదుపాయాలున్నా ఆరుగురు మాత్రమే ఈ హాస్టల్లో ఉన్నారు.

ఇష్టానుసారం ఇన్‌చార్జి బాధ్యతలు

తిరువూరులోని బీసీ సంక్షేమ వసతి గృహ వార్డెనుకు ఇబ్రహీంపట్నంలో మరో హాస్టల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వారంలో ఒకటి, రెండు సార్లు కూడా వచ్చే అవకాశం లేక కింది స్థాయి సిబ్బందిపై వార్డెన్ ఆధార పడవలసి వస్తోంది. రెండు హాస్టళ్లలోనూ విద్యార్థులకు ఆమె అందుబాటులో ఉండట్లేదు.

నిరుపయోగంగా పక్కా భవనాలు

విస్సన్నపేటలో గతంలో నిర్మించిన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు అన్ని సదుపాయాలు ఉన్నా తాళాలు వేసి ఉంచారు. తిరువూరు తోకపల్లి రోడ్డులో సాంఘిక సంక్షేమ వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరగా, పునర్నిర్మాణానికి గతంలో మంజూరైన నిధులు సకాలంలో వినియోగించకపోవడంతో వెనక్కు మళ్లాయి. ప్రస్తుతం బాలికల వసతి గృహాన్ని ప్రైవేటు భవనంలో నడుపుతున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.



విస్సన్నపేటలో మూతబడిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం

హాస్టళ్లంటే చిన్న చూపు తగదు



ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులుండే వసతి గృహాల గోడు ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరం. బడ్జెట్లో వసతి గృహాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలి. వసతుల లేమితో ఇబ్బంది పడుతున్న భవనాలకు వెంటనే మరమ్మత్తులు చేయించాలి.

– కాలసాని గోపాల నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘ నాయకులు, తిరువూరు

కళాశాల వసతి గృహాల భవనాలు నిర్మించాలి



కళాశాల విద్యార్థినీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వసతి గృహాలకు పక్కా భవనాలు లేక అద్దె గదుల్లో నడుపుతున్నారు. వీటిలో వసతులు లేక, గదులు చాలక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే హాస్టళ్ల పరిస్థితి మెరుగుపరచాలి.

– వెంకటేశ్వరావు, విద్యార్థి సంఘనాయకుడు, తిరువూరు

ఇంటి నుంచే చాపలు, దుప్పట్లు

నూజివీడు: నియోజకవర్గంలో హాస్టల్స్ తెరిచి 45 రోజులు అవుతున్నా విద్యార్థులకు దుప్పట్లు, కార్పెట్లను ప్రభుత్వం ఇవ్వలేదు. విద్యార్థులు ఇళ్ల నుంచే చాపలు, దుప్పట్లు తెచ్చుకొని కింద వేసుకొని నిద్రిస్తున్నారు. జనవరి నెల నుంచి సబ్బు, కొబ్బరినూనె సంబంధించి కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. నూజివీడు పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌లో 220 మంది విద్యార్థులుండగా ఈ వసతిగృహాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. ముగ్గురు కుక్‌లు, ముగ్గురు వాచ్‌మెన్‌లు, ముగ్గురు కామాటీలు ఉండాల్సి ఉండగా ఒక కుక్, ముగ్గురు కామాటీలు మాత్రమే ఉన్నారు. ఒక కామాటీని సర్వెంట్ విధులకు కేటాయించారు. ముగ్గురు వార్డెన్లు ఉండాల్సి ఉండగా ఇద్దరే పనిచేస్తున్నారు. కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో గదుల్లోకి దోమలు వస్తున్నాయి. పట్టణంలోని అజరయ్యపేటలోని కాలేజీ బాలుర హాస్టల్‌కు, మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలోని కాలేజీ బాలికల హాస్టల్‌కు రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడంతో ఇన్‌చార్జి వార్డెన్లు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. నెహ్రూపేటలోని ఒకే కాంప్లెక్స్‌లో మూడు బాలికల హాస్టళ్లు ఉండగా ఇద్దరు వార్డెన్లు మాత్రమే పని చేస్తున్నారు.

తలుపులు లేని టాయిలెట్లు..

ముసునూరు: ముసునూరులోని ఎస్సీ బాలికల వసతిగృహం టాయ్‌లెట్లకు తలుపులు లేకపోవడంతో బాలికలు టాయ్‌లెట్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. వార్డెన్ ఒక్కరే ఉండగా కామాటీతోనే వంట పనిచేయిస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకులు నియమించిన రోజువారీ కూలీలతోనే హాస్టల్ పనులు చేయిస్తున్నారు. కోడిగుడ్లు ఉడకబెట్టినవి కాకుండా కూర తయారు చేసి ఇస్తున్నారు. పాలు, అరటిపండు ఇవ్వకుండా స్థానికంగా లభ్యమయ్యే బొప్పాయి కాయలు తెచ్చి ముక్కలు ఇస్తున్నారు.

ఆగిరిపల్లిలో...

ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థినులకు కార్పెట్‌లు, దుప్పటి ఇవ్వలేదు. హాస్టల్‌లో సిబ్బంది కొరత నెలకొంది. కాస్మోటిక్స్ చార్జీలను ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇవ్వాల్సి ఉంది.



ముసునూరులోని బాలికల వసతిగృహంలో తలుపులు లేని బాత్‌రూంలు

సంక్షిప్త వార్తలు

చట్టాలపై అవగాహన అవసరం : సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం

నూజివీడు: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం పేర్కొన్నారు. పట్టణంలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం రాత్రి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మహిళలకు, బాలికలకు సంబంధించి పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, గృహ హింస నివారణ చట్టం తదితర అనేక చట్టాలు ఉన్నాయన్నారు. వీటన్నింటి గురించి బాలికలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఆడపిల్ల ఉన్నత చదువులు చదివాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, న్యాయవాదులు ఎస్‌కేడీ ప్రసాద్, గోపీనాథ్, రామారావు, జానకీరామ్, వార్డెన్ మాధురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ముసునూరు: ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయుడు అక్కినేని రాజశేఖర్ సన్మాన కార్యక్రమం గుడిపాడు జెడ్పీ హైస్కూల్లో హెచ్.ఎం నాగబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పద్మ కిశోర్, రాంబాబు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు రాజశేఖర్ దంపతులను ఘనంగా సత్కరించి, నూతన వస్త్రాలు, జ్ఞాపికలను బహూకరించారు. ఎంఈఓ-2 బీవీఎస్ సుబ్బారావు, రిటైర్డ్ హెచ్‌ఎం డీఆర్‌కే ప్రసాద్, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5న స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

ముసునూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర నేత చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. ముసునూరులో శనివారం సీపీఐ రాష్ట్ర నేత కొమ్మన నాగేశ్వరరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ ఆగస్టు 5 వామపక్షాలు చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నియోజక వర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, కార్యవర్గ సభ్యులు, మండల నేతలు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వృద్ధుని ఆత్మహత్య

ముసునూరు: కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆసుపత్రిపాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. చింతలవల్లి శివారు గోగులంపాడు కొత్తూరుకు చెందిన చెన్ను గుర్నాథం (65) తరచూ కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం కూడా కడుపునొప్పి అధికంగా రావడంతో తట్టుకోలేక పురుగు మందు తాగాడు. నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జెడ్పీ పాఠశాలలో నో బ్యాగ్ డే

మైలవరం: మైలవరం శ్రీరాజా ఎస్వీఆర్‌జీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ్య భాషా సాంస్కృతిక క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పద్య నాటక కళాకారులు బాలాజీ, వాణీపతి శాస్త్రి, నాటక కర్త నటుడు బాలచందర్‌లు విద్యార్థులకు పద్యం రాగయుక్తంగా పాడటం, నటనలో మెలకువలు వివరించారు. క్లబ్ ఆధ్వర్యంలో కళాకారులను సన్మానించారు.

టెక్నాలజీపై అవగాహన పెంపొందాలి

మైలవరం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డేటా వ్యాలీ రిసోర్స్‌పర్సన్ ఎం. రఘువీర్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగంలో మూడో సంవత్సరం విద్యార్థులకు వారం రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు శనివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆరోగ్యం, విద్య, పరిశ్రమ, సాంకేతికత అనే నాలుగు ప్రధాన బృందాలుగా విభజించి విద్యార్థుల నుంచి 28 గ్రూపులు ఏర్పాటు చేసి హ్యాకథాన్ నిర్వహించారు. హ్యాకథాన్‌లో ఉత్తమ ప్రాజెక్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఐటీ విభాగాధిపతి డాక్టర్ డి. రత్నకిశోర్, వర్క్‌షాపు కో-ఆర్డినేటర్లు ఎం. విజయకుమార్, డి. విజయశ్రీ, కె. రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ టవర్ వద్ద చెలరేగిన మంటలు

ఇబ్రహీంపట్నం: స్థానిక కాజీమాన్యంలో అపార్ట్‌మెంట్ల సమీపంలో ఉన్న ఒక ప్రముఖ కంపెనీ సెల్ టవర్‌లో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. సెల్ టవర్ వద్ద కేబుల్ బాక్స్‌లో మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమీపంలోని అపార్ట్‌మెంట్ వాసులు ఫైర్ స్టేషన్‌కు, పోలీస్‌లకు సమాచారం అందించారు. అగ్నిమాపక దళ మంటలను అదుపులోకి తెసుకు వచ్చారు. పోలీసులు విచారణ చేపట్టారు.

డ్రమ్ సీడర్‌తో వరి సాగుపై సూచనలు

కాకర్ల(తిరువూరురూరల్): కాకర్ల పంచాయతీ పరిధిలోని రామన్నపాలెంలో ప్రకృతి సేద్య పద్ధతిలో డ్రమ్ సీడర్ ద్వారా వరి విత్తనాలు నాటే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజరు శంకర్ నాయక్ పర్యవేక్షణలో రైతులకు డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు నాటడంపై అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో రైతులకు సాగు ఖర్చు తగ్గడంతో పాటు పురుగులు, తెగుళ్ల నివారణ వ్యయం కూడా ఉండదని వివరించారు. ప్రకృతి సేద్యం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు సేవలు ఎనలేనివి

తిరువూరు: దివంగత ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని కోనేరు కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. తిరువూరు నియోజకవర్గానికి రెండుసార్లు ప్రాతినిథ్యం వహించి చేసిన అభివృద్ధి పనులను నాయకులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, జీవన్‌బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు ప్రకాశరావు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్గిల్ మృతులకు నివాళి

తిరువూరు: భారత సైన్యం పాక్ సైన్యంపై వీరోచితంగా పోరాడి కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమర వీరులకు ప్రతి ఒక్కరూ నివాళులర్పించాలని గంపలగూడెం మండలం పెనుగొలను సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు పూటుకూరు నారాయణరావు అన్నారు. శనివారం కార్గిల్ విజయ దివస్ కార్యక్రమాన్ని పెనుగొలను ఎంపీపీ స్కూల్‌లో నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలవంతంగా వంట ఏజెన్సీ తొలగింపు

నూజివీడు: నూజివీడు పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు ఎల్. పద్మను బలవంతంగా తొలగించారు. ఆమె స్థానంలో హైస్కూల్ ప్లస్ ఎస్ఎంసీ చైర్మన్ నెర్సు నాగులు, పట్టణంలోని బాలాజీ గ్రూపునకు చెందిన డీ మాధవీలతను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏజెన్సీ నిర్వాహకురాలు ఎల్. పద్మ సుమారు 18 ఏళ్లుగా పనిచేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నుంచి ఈమెను తొలగించి ఎలాగైనా ఏజెన్సీని కైవసం చేసుకోవాలని కొందరు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ చివరికి అధికార బలంతో విజయం సాధించారు. మెజారిటీ విద్యార్థులు, మెజారిటీ తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేనప్పటికీ తొలగించడం గమనార్హం.

తొలగింపు నిబంధనలు ఇవి..

నిబంధనల ప్రకారం ఉన్న ఏజెన్సీని తొలగించి నూతన వ్యక్తులను నియమిస్తున్నట్లు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు సంతకాలు చేసిన లెటర్‌ను డీఈఓ కార్యాలయంలోని ఏడీ ఓకే చేయాలి. కానీ ఇక్కడ అవేమీ లేకుండానే భోజనం వండటానికి శనివారం స్కూల్ వద్దకు వచ్చిన ఏజెన్సీ నిర్వాహకులను పోలీసులతో బయటకు పంపించి వేశారు. తొలగించిన ఏజెన్సీ కింద ఏడుగురు వ్యక్తులు జీవనం సాగిస్తున్నారు.

జాబ్‌మేళాలో 257 మందికి ఉద్యోగాలు

విస్సన్నపేట: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేదుకు జాబ్ మేళా ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. స్థానిక శ్రీశ్రీ డిగ్రీ, పీజీ కళాశాల వద్ద కేశినేని ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. 21 కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.543 మంది హాజరు కాగా 257 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించారు. ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు, ఆర్డీఓ మాధురి, తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చేకు చినరాట్నాలు, కళాశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'

తిరువూరు: తిరువూరు పట్టణ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరువూరు: ఆగస్టు 1, 2 తేదీల్లో జగ్గయ్యపేటలో జరుగనున్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను శనివారం తిరువూరు సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. జగ్గయ్యపేటలో జరిగే ఈ మహాసభలకు పార్టీ కార్యవర్గసభ్యులు తరలిరావాలని జిల్లా పార్టీ నాయకులు తూము కృష్ణయ్య కోరారు. నియోజకవర్గ కార్యదర్శి నాగుల్‌మీరా, మాలపాటి ఉదయ్, సుబానీ, మీరా తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొండూరులో..

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా మహాసభల ప్రచార వాల్‌పోస్టర్లను ఎ.కొండూరులో శనివారం ఆ పార్టీ కౌలు రైతుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ ఆవిష్కరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.